క్లుప్తంగా

176 మందికి వైద్య పరీక్షలు

మల్కాపురం(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జయప్రద పౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ శంకర్ నేత్రాలయం వైద్యులు 176 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 68 మందికి కంటి శుక్లాలను గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబోజీ జాను, పౌండేషన్ ప్రతినిధి కట్టా నరసింహారావు, సొసైటి మాజీ అధ్యక్షుడు పిచ్చయ్య చౌదరి, మాజీ సర్పంచ్‌లు ముల్లంగి రామకృష్ణారెడ్డి, కళ్యాణ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



నందిగామరూరల్: మండలంలోని రుద్రవరం గ్రామంలో వేంచేసియున్న అన్నపూర్ణా సహిత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం భక్తుల శివనామ స్మరణ, వేద పండితోల మంత్రోచ్చరణ నడుమ ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు, హోమాది క్రతువులు, పూర్ణాహుతి పూజలను చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రాచీన ఆలయం కావడంతో ధ్వజస్తంభం జీర్ణావస్థకు చేరడంతో భక్తులు, గ్రామస్తుల సహకారంతో నూతన ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ కార్యక్రమం జరిపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ



కంచికచర్ల: అక్షయ తృతీయ సందర్భంగా స్థానిక కొట్ల సందులో వాసవి యువసేన, ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో పేదలకు బుధవారం దద్దోజనం, మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతి ఏడు మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రజలకు అక్షయ తృతీయ పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘ నాయకులు దొడ్డా రామ్మోహనరావు, జైనరసింహారావు ఆర్యవైశ్య సంఘ నాయకులు, వాసవి యువసేన నాయకులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి



మస్తాన్ (ఫైల్)

వీరులపాడు: వడదెబ్బ తగిలి గుండెపోటుకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన వీరులపాడు గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు సమాచారం మేరకు వీరులపాడు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ (58) రోజు మాదిరిగానే బుధవారం కూడా గ్రామంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చే క్రమంలో వడదెబ్బకు గురై గుండె పోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

వెంకటేశ్వరునికి పూలంగి సేవ

నందిగామరూరల్: పట్టణంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామి వారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామి వారికి వసంతోత్సవం, చక్రస్నానం, మూలమంత్ర హోమాది క్రతువులు, పూర్ణాహుతి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రికి స్వామి, అమ్మవార్లకు పూలంగి సేవను కన్నుల పండువగా జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు నకిరికంటి విశ్వేశ్వరరావు, గద్దె మదుసూదనరావు, బండారు కేదార్‌నాథ్, పులిపాటి శ్రీనివాసరావు, కొప్పు రామారావు, కొంగర దుర్గాప్రసాద్ కలిసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేట మండలం కె.అగ్రహారం ఎస్సీకాలనీలో పనిచేయని బోరు



షేర్‌మహ్మద్‌పేటలో ప్రధాన రహదారి వద్ద పనిచేయని బోరు



రావిరాలలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిరుపయోగంగా ఉన్న బోరు



బండిపాలెం ఎస్సీకాలనీలో అలంకారప్రాయంగా మారిన బోరు

ఎమ్మెల్యే సారూ.. బోర్లను బాగు చేయించరూ!



చిల్లకల్లు ఎస్సీకాలనీలో మరమ్మతులకు గురైన బోరు

జగ్గయ్యపేట: నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఉన్న వందలాది తాగునీటి బోర్లు మరమ్మతులకు గురై పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో కలిపి మొత్తం 1500 తాగునీటి బోర్లు ఉండగా, అందులో సుమారు 350కిపైగా బోర్లు పనిచేయడం లేదు. దీంతో వాడుక, తాగునీటి కోసం ప్రజలు తీవ్ర అవస్థలుపడుతున్నారు. ఓవైపు వేసవి ఎండలు మండుతుండగా, మరోవైపు తాగునీటి సమస్యతో జనం అల్లాడుతున్నారు. ఆయా బోర్లకు మరమ్మతుల విషయాన్ని సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోకపోతుండటంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) స్పందించి ఆయా బోర్ల మరమ్మతులకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లింగాల కాజ్‌వేకు మరమ్మతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుత్తా శంకరరావు, ఎంపీపీ రమాదేవి

వత్సవాయి: ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న లింగాల కాజ్‌వే మరమ్మతులను రాష్ట్రప్రభుత్వం వెంటనే చేపట్టాలని వత్సవాయి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకరరావు, ఎంపీపీ కొలుసు రమాదేవి డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ గతేడాది సెప్టెంబర్‌లో మునేటి వరద ఉధృతికి కాజ్‌వే ధ్వంసమైందన్నారు. వరదలొచ్చి పదినెలలు కావస్తున్నా కాజ్‌వేకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాజ్‌వే మరమ్మతుల విషయాన్ని పదినెలలుగా ఎమ్మెల్యే, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

లింగాల గ్రామానికే చెందిన మాజీఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడగా పేరుగాంచిన టీడీ జనార్దన్ కూడా కాజ్ వే మరమ్మతులను పట్టించుకోకపోతుండటం అన్యాయమన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాలకులు వెంటనే స్పందించి వారంరోజుల్లో మరమ్మతు పనులు చేపట్టాలని, లేనిపక్షంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కాజ్‌వే వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆళ్లూరుపాడు, వేమవరం గ్రామాలలో వరదకు మేట వేసిన ఇసుక దిబ్బలను తొలగింపునకు అనుమతులు ఇవ్వాలని పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఉపయోగం లేకుండా పోయిందని వాపోయారు.

వరదలకు ఇసుక దిబ్బలు పెట్టి పొలాలు పాడైపోయాయని, ఏడాది గడస్తున్నా దిబ్బలు తొలగించుకోలేక రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో క్వింటా మిర్చి రూ.23వేలు పలుకగా, నేడు కూటమి ప్రభుత్వ పాలనలో కేవలం రూ.10 వేలకు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హామీలు అమలుచేయకుండా మోసం చేస్తే, ప్రజలు కూడా తగిన సమయంలో కూటమి ప్రభుత్వానికి గట్టిగానే బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలిక పోగు వెంకటేశ్వర్లు, మండల పార్టీ కార్యదర్శి పసుపులేటి సీతారామయ్య, వత్సవాయి గ్రామపార్టీ అధ్యక్షులు మెట్టకోలు నరేష్, మండల రైతు, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు చిరుమామిళ్ల శ్రీను, నెల్లూరి నారాయణ, జిల్లా పార్టీ కార్యదర్శి దారావతు రూప్లానాయక్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కుక్కల శ్రీధర్, మేకల వెంకటేశ్వర్లు, మండల యువజన విభాగం నాయకుడు వడ్లమూడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులకు ఘనసత్కారం



జడ్జిలు శ్రావణి, శోభారాణిలను సత్కరిస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేట అర్బన్: బదిలీపై వెళ్తున్న జగ్గయ్యపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొప్పుల శ్రావణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మైలాబత్తుల శోభారాణిలను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి మాట్లాడుతూ తనకు జగ్గయ్యపేట తల్లి లాంటిదని పేర్కొన్నారు. ఇక్కడ పనిచేయడం మొదటిసారి అయినప్పటికీ సీనియర్ న్యాయవాదుల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని తెలిపారు. తనకు సహకరించిన న్యాయవాదులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి మాట్లాడుతూ తాను 33ఏళ్లకు పైగా జ్యుడీషియరీలో పనిచేస్తున్నానని, కానీ జగ్గయ్యపేటలో పనిచేయడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఇప్పటివరకు 6,200 తీర్పులు ఇచ్చినట్లు తెలిపారు. న్యాయవాదులు, జడ్జీలు నిరంతరం విద్యార్థులన్నారు. చట్టాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాల్సి ఉంటుందన్నారు. న్యాయవాది, మెజిస్ట్రేట్ సమన్వయంతో కలిసి పనిచేసినప్పుడే కోర్టులు సజావుగా సాగుతాయన్నారు. అనంతరం న్యాయవాదులంతా కలిసి న్యాయమూర్తులను దుశ్శాలువలు, పూలబొకేలతో ఘనంగా సత్కరించారు. స్థానిక సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు అధ్యక్షత వహించగా, న్యాయవాదులు ఈవీ.జగన్నాధరావు, పసుపులేటి సత్యశ్రీనివాసరావు, సామినేని వెంకటేశ్వరరావు, రాయపూడి శ్రీనివాసరావు, వి.మధు, కరణం నరసింహారావు, గోనెల వెంకటేశ్వర్లు, దామాల సంతోష్, కాంతారావు, టీఎల్.నరసింహారావు, ధనుంజయుడు, బూడిద నరసింహారావు, జూనెబోయిన శ్రీనివాసరావు, దాసరి నాగేశ్వరరావు, ఆంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కంచికచర్ల: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయిన లారీ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలంగాణ రాష్ట్ర లారీ డ్రైవర్ల సంఘ నాయకులు ప్రసాద్ బుధవారం తెలిపారు. కంచికచర్లకు చెందిన అనిల్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తిరుమల, తిరుపతి గ్రూప్, వరలక్ష్మీ గ్రూప్ ఆధ్వర్యంలో అనిల్ కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్ల సంఘ నాయకులు ఓబులేసు, మణి నాయుడు, సీఐటీయూ జిల్లా నాయకులు లాల్ అహ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రాంగణంలోకి సెంట్రల్ బ్యాంకు



బ్యాంకు నూతన ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న జోనల్ హెడ్ ధారాసింగ్‌నాయక్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక విజయవాడ రోడ్డు నుంచి న్యాయవాది ఈవీ జగన్నాథరావు భవన్‌లోకి మార్పుచేసిన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయాన్ని బుధవారం ఆ బ్యాంకు అధికారులు ప్రారంభించారు. బ్రాంచి నూతన ప్రాంగణాన్ని ఆబ్యాంకు జోనల్ హెడ్ కె.ధారాసింగ్‌నాయక్ ప్రారంభించారు. అనంతరం బ్యాంక్ అధికారులు, వినియోగదారులతో ఆయన మాట్లాడారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశంలో ప్రజలకు నగదు, లావాదేవీలను అందించడానికి సులభతరం చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ రీజనల్ హెడ్ పి.సతీష్‌బాబు, జగ్గయ్యపేట బ్రాంచ్ హెడ్ బి.శ్రీరాములు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలోని వివిధ విభాగాల కమిటీలు, నియోజకవర్గ కమిటీల నియామకం జరిగింది. రాష్ట్ర మున్సిపల్ మున్సిపల్ వింగ్ కమిటీ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ వింగ్ కమిటీ జాయింట్ సెక్రటరీగా ఎన్టీఆర్ జిల్లాకు చెందిన దొండపాటి నాంచారయ్య నియమితులయ్యారు. అదేవిధంగా నందిగామ అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా అల్లు జయప్రతాప్‌రెడ్డి నియమితులయ్యారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా దర్శి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు.

ఘనంగా నరసింహస్వామి పడిపూజ

జయంతిపురం(జగ్గయ్యపేట): మండలంలోని జయంతిపురంలో మంగళవారం రాత్రి నరసింహస్వామి పడిపూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక మండపం, 18 మెట్లను ఏర్పాటు చేసి అర్చకులు లక్ష్మీ హైగ్రీవాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, పండ్లరసాలతో స్వామివారికి అభిషేకాలు, నవగ్రహపూజలు నిర్వహించారు. నరసింహస్వామి మాల దీక్షాదారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



నందిగామరూరల్: ప్రతిఒక్కరు ఏసుచూపిన మార్గంలో నడుచుకోవాలని వేదివాడ డీనరీ చైర్మన్ రాజశేఖర్ సూచించారచు. మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలోని సీఎస్ఐ చర్చి 13వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషుల పాపవిమోచనకు ఏసుక్రీస్తు సిలువపై రక్తాన్ని చిందించారన్నారు. తోటివారిపై ప్రేమ, దయ కలిగి ఉండాలని సూచించారు. క్రీస్తు చూపిన మార్గం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని చెప్పారు. అనంతరం డీనరీ చైర్మన్ రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్‌లు ప్రకాశరావు, డేవిడ్ రాజు, గోపాలరావు, సంఘస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేరకలపాడులో తాగునీటి ఇక్కట్లు

పేరకలపాడు(కంచికచర్ల): మండలంలోని పేరకలపాడు ఎస్సీకాలనీకి ఐదురోజులుగా తాగునీరు సరఫరా కావటంలేదని సొసైటీ మాజీ అధ్యక్ష్యుడు వేమవరపు పురుషోత్తం బుధవారం తెలిపారు. కాలనీలో ఎక్కువగా కూలీ పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నామని మూడు రోజులకు ఒకసారి వచ్చే తాగునీరు సక్రమంగా ఐదు రోజులైనా రాకపోవడంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఎస్సీకాలనీకి తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఇబ్రహీంపట్నం: మామిడి తోటలో కాపలా ఉంటూ స్పృహతప్పి పడిపోయిన షేక్ జాన్‌బీ(45) చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వీరులపాడు గ్రామానికి చెందిన షేక్ సైదా తన భార్య జాన్‌బీతో కలిసి కేతనకొండ మామిడి తోటలో కాపలా ఉంటున్నాడు. భర్త కేతనకొండలో సరుకుల కోసం వెళ్లిన సమయంలో భార్య నోటి వెంట నురగలు కక్కుతూ తోటలో పడి ఉంది. అదే సమయంలో పక్కన మరో మామిడి తోట యజమాని జిలానీ పాషా, షేక్ జాన్‌బీ పరిస్థితి గమనించి జూపూడిలో ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో భర్త సైదా విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

చాట్రాయి: నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐలు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో సారా బట్టీపై మెరుపు దాడి చేశామని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య బుధవారం తెలిపారు. మండలంలోని జనార్దనవరంలో అతి రహస్యంగా సారా తయారు చేస్తున్న బెజవాడ శ్రీనివాసరావుకు చెందిన సారా బట్టీపై దాడి చేశారు. 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. బట్టీ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. నూజివీడు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి వేడుకలు



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రసమయి సాహితీవేత్తలు, లైబ్రరీ సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం రసమయి సాహితీ సమితి ఆధ్వర్యంలో మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) 115వ జయంతిని ఘనంగా ర్వహించారు. ఈ సందర్భంగా రసమయి సాహితీ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, కవి, రచయిత దోసపాటి నాగేశ్వరరావు పలువురు సహితీ వేత్తలతో కలిసి శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీశ్రీ 7ఏళ్ల వయస్సులోనే ప్రభవ అనే కావ్యాన్ని రచించాడని, అనంతరం కవితా రంగంలో విరసం, అరసం అధ్యక్షునిగా పనిచేశారని వివరించారు. కష్టజీవుల కన్నీళ్లకు కవితా రూపం ఇచ్చారని, ఆయన రాసిన మహాప్రస్థానం సాహితీ లోకంలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఎన్నో దేశభక్తి, సినిమా గీతాలను అభ్యుదయ పంథాలో రచించారని గుర్తుచేశారు. శ్రీశ్రీకి నివాళులర్పించిన వారిలో సాహితీ సమితి సభ్యులు నివాస్, వెంకయ్య, ఈశ్వర్, జానీ, కోట ప్రభుజీరావు,బాబ్జీ, విల్సన్‌బాబు, గ్రంథాలయ సిబ్బంది ఆలేటి ప్రభ, బీడీసీలు రమేష్, శ్యామల, రాము ఉన్నారు.

ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష



నందిగామలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నందిగామ రూరల్: పట్టణంలో బుధవారం నిర్వహించిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, కోఆర్డినేటర్ రమేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డీవీఆర్ జూనియర్ కళాశాల, శ్రీవిద్యా హైస్కూల్, నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, కెవీఆర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 1472 మంది విద్యార్థులకుగాను 1248 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 224మంది గైర్హాజరైనట్లు వివరించారు. మొత్తంగా 84.78శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, వైద్య శిబిరం, తాగునీటి వసతి కల్పించినట్లు రమేష్ బాబు వివరించారు.

సీహెచ్‌ఓల సమ్మెకు మద్దతుగా నిలుస్తాం



ఏపీఎన్‌జీజీఓ అధ్యక్షుడు శివారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీఎంసీఏ నాయకులు

ఎన్‌జీజీవో అసోసియేషన్ అధ్యక్షుడు శివారెడ్డి

నందిగామ రూరల్: రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతుగా మద్దతు పలుకుతామని ఏపీఎన్‌జీజీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి హామీ ఇచ్చారు. విజయవాడలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏపీఎంసీఏ రాష్ట్ర నాయకులు బుధవారం శివారెడ్డిని కలిసి తమ సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమ్మెకు మద్దతు పలకాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం శివారెడ్డి మాట్లాడుతూ సీహెచ్‌వోల న్యాయమైన సమస్యల పరిష్కారానికి తమ వంతుగా మద్దతునిస్తామని ప్రకటించారు. ముఖ్యంగా 23శాతం వేతన పెంపు, ఉద్యోగ భద్రత, ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపుతోపాటు పలు సమస్యల పరిష్కారానికి మద్దతుగా నిలుస్తామని తెలిపారు. సీహెచ్‌వోల సమస్యలను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఏపీఎంసీఏ నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సందీప్ కుమార్, కోఆర్డినేటర్ వినోద్, జిల్లా కార్యదర్శి ఝాన్సీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వర్షిణి, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

5 నుంచి చిట్టేల వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు

చిట్టేల(వత్సవాయి): మండలంలోని చిట్టేలలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి 14వ వార్షిక బ్రహ్మోత్సవాలను మే 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్త మారెళ్ల పుల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న సుప్రభాతసేవ, తోమాలసేవ, గోపూజ, శ్రీవారి పంచామృత అభిషేకం, యాగశాల ప్రవేశము, 6న పుణ్యావాహచనము, భేరిపూజ, సంతానము లేనివారికోసం గురుడా ప్రసాదం అందజేత 7న పల్లకీ ఉత్సవం, ఉత్సవమూర్తులకు విశేషస్నపన, ఉంజల్‌సేవ, శ్రీవారి కల్యాణోత్సవము, 8న యాగశాల కైంకర్యములు, సూర్యప్రభ వాహనసేవ, వాహన సమర్పణ, ఏకాంతసేవ, 9న పాల పొంగళ్ల సమర్పణ, ప్రభంజనోత్సవం, గ్రామ దేవతలకు జలబిందెలు, చక్రస్నానము, పవళింపుసేవ, స్వామివారికి అమ్మవారికి అష్టబంధనం , మహాశాంతి తిరుమంజనం, పుష్పాయాగం, ఏకాంతసేవ అనంతరం తీర్థప్రసాదాలు వినియోగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. పీటలపై కూర్చునే దంపతులు ముందుగా తమపేర్లను ఆలయం వద్దకు వచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. బ్రహ్మోత్సవాలకు శ్రీత్రిదండి చిన్నజీయర్‌స్వామి తోపాటు గరికపాటి నరసింహరావు, పలువురు ప్రవచనకర్తలు పాల్గొంటారని చెప్పారు. హరిశివరామప్రసాద్‌శాస్త్రి, సిరికొండ సాయికృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

కౌన్సిల్ సభ్యులతో సమీక్ష

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 2వ తేదీన జరుగనున్న రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభం సందర్భంగా నిర్వహించే సభను జయప్రదం చేయాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి కోరారు. సభకు జగ్గయ్యపేట నుంచి ప్రజలను తరలించే అంశంపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆమె మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కౌన్సిల్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ పనులకు శంకుస్థాపన చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విచ్చేస్తున్న సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది మంది ప్రజలు తరలి వచ్చేలా వారికి బస్సుల సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీరాం చినబాబు, టీడీపీ సీనియర్ నాయకుడు మైనేని రాధా, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకులతో సమావేశం

నందిగామటౌన్: అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి నర్సింగ్‌రావు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ తంబళ్లపల్లి రమాదేవి, బీజేపీ నాయకులు మాదాల రమేష్, తొర్లికొండ సీతారామయ్య పాల్గొన్నారు.